ఈసారైనా నిషేధం జరిగేనా...?

- మరోమారు తెరపైకి ప్లాస్టిక్ నిషేధం
- విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఆకస్మిక దాడులు
- నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై కొరడా ఝులిపిస్తున్న అధికారులు

విజయనగరం: పాలిథిన్ ఉత్పత్తుల వినియోగం విపరీతంగా పెరిగిపోయి పర్యావరణానికి విఘాతం ఏర్పడుతోంది. ఇటువంటి పరిస్థితిలో వీటి వాడకాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నా, ఎక్కడా ఆశించినంత ఫలితం దక్కడం లేదు. కొందరు అధికారులు నిషేధం అమలుపై కఠిన నిర్ణయాలు తీసుకుంటుండగా... వారి బదిలీ అనంతరం యథారాజా తథా ప్రజా అన్న చందంగా తంతు సాగిపోతోంది. ఈ విషయాన్ని గమనించిన మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు మరోసారి పాలిథిన్ నిషేధానికి దశల వారీగా చర్యలు చేపట్టి, పకడ్బందీగా అమలు చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని స్పష్టం చేశారు. అంతేగాకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఆ శాఖ అధికారులు రంగంలోకి దిగి, వ్యాపార సంస్థలపై ఆకస్మిక దాడులు చేపడుతున్నారు. పాలిథిన్ ఉత్పత్తులు విక్రయించిన వారికి భారీగా జరిమానాలు విధించనున్నారు. ఈ పరిణామాలతోనైనా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎంత వరకు మార్పు వస్తుందో వేచి చూడాల్సి ఉంది.



హోల్‌సేల్ దుకాణం వద్ద నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేస్తున్న ప్రజారోగ్య సిబ్బంది



స్వాధీనం చేసుకున్న పాలిథిన్ ఉత్పత్తులు

చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి..

నగరంలోని దుకాణాదారులకు అధికారులు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. దుకాణం ముందు చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. వాటిల్లోనే వ్యర్థాలను వేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలి. అలాగే ఇళ్లల్లో రెండు బుట్టలు ఏర్పాటు చేసుకుని తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందించాలి. నిబంధనలకు విరుద్ధంగా చెత్త ఎక్కడ పడితే అక్కడ వేసినా జరిమానా విధిస్తారు. హోటళ్లు, టీ దుకాణాలు, తినుబండారాల తయారీదారులు, దాబాల్లో నార సంచులు వినియోగిస్తే మంచి ఫలితాలుంటాయి.

ప్రత్యామ్నాయం ఉంటేనే..

గతంలో చాలాసార్లు విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ నిషేధిస్తున్నట్లుగా అప్పటి కమిషనర్లు ప్రకటించారు. తనిఖీలు చేపట్టి దుకాణదారులకు తాఖీదులు ఇవ్వడమే కాకుండా, పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని జరిమానాలు కూడా విధించారు. వీటి వినియోగంతో జరిగే అనర్థాలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించినా పరిస్థితిలో మార్పు రాలేదు. వీటికి ప్రత్యామ్నాయం లేకపోవడమే వల్లే వినియోగం ఎక్కువవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పట్టణాల్లో ఎక్కడ చూసినా ఈ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. రోడ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలు, మురుగు కాల్వల్లో పాలిథిన్ కవర్లు, కప్పులు పేరుకుపోయాయి.



120 మెట్రిక్ టన్నుల చెత్త..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్‌లు ఉండగా సుమారు 3 లక్షల జనాభా నివసిస్తున్నారు. ప్రతిరోజూ నగర పరిధిలో 120 మెట్రిక్ టన్నుల మేర చెత్త ఉత్పత్తి అవుతుండగా... వాటిలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులే అధికంగా ఉండడం గమనార్హం. నగరంలోని ప్రధాన మార్కెట్‌లో హోల్‌సేల్‌గా ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయించే వారి దగ్గర నుంచి రహదారులపై వ్యాపారాలు చేసుకునే వారు ఎక్కడబడితే అక్కడ చెత్త పారబోస్తున్నారు. నిబంధనల ప్రకారం సొంతంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాల్లో వేయాల్సి ఉన్నా ఆ విషయాన్ని విస్మరిస్తున్నారు. పోగయ్యే చెత్తను ఉదయం కార్పొరేషన్ వాహనాల్లో వేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. సమీప ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కనే కుప్పలుగా పోస్తున్నారు.

తాజా ఆదేశాలు..

120 మైక్రాన్ల కంటే మందం తక్కువగా ఉన్న పాలిథిన్ ఉత్పత్తులను వినియోగించవద్దని తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఎవరైనా వీటిని విక్రయించినా, ఉపయోగించినా ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ (1986) ప్రకారం సామగ్రి జప్తు చేయడంతో పాటు రూ. 5 వేల నుంచి పది వేల రూపాయల వరకు జరిమాన విధించే అవకాశం ఉంది. అలాగే దుకాణ లైసెన్స్‌లను రద్దు కూడా చేయవచ్చు.

ప్రజల సహకారం అవసరం..

ప్లాస్టిక్ వ్యర్థాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల సహకారం అవసరం. దుకాణదారుల్లో నోటీసులు అందజేస్తూ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. గతంలో మాదిరిగా కాకుండా పకడ్బందీగా వ్యవహరిస్తాం. రెండు రోజులుగా చిరు వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు హోల్‌సేల్ దుకాణాల్లో దాడులు నిర్వహించి నిషేధిత 560 కేజీల ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నాం.

– పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

క్లుప్తంగా

దోమల నియంత్రణకు ఫాగింగ్



నగరంలో ఫాగింగ్ చేపడుతున్న దృశ్యం

విజయనగరం: నగరంలో దోమల నియంత్రణలో భాగంగా ఫాగింగ్ ప్రక్రియను ప్రజారోగ్య సిబ్బంది ముమ్మరం చేశారు. కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు రోజుకొక డివిజన్‌లో ఫాగింగ్ చేపడుతున్నారు. అలాగే దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్లు చేపడుతున్నారు. కుంటలు, చెరువులు ఇతర నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు.

భక్తుల సౌకర్యార్థం టెంట్ల ఏర్పాటు



అన్నదాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ఆదివారం టెంట్లు ఏర్పాటు చేశారు. నిత్యాన్నదాన భవనం వద్ద అన్నప్రసాదాల కోసం భక్తులు మండుటెండలో నిరీక్షించాల్సి వచ్చేది. భక్తుల ఇబ్బందులను గమనించిన దేవస్థాన సిబ్బంది అన్నదాన సత్రం ప్రాంగణంతో పాటు శివాలయం వద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో నిలుచునే భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేశామని ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్సై బి. గణేష్ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థీ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అలాగే చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ జయకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి: స్థానిక కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి గరివిడి మండలంలోని అప్పన్నవలసకు చెందిన దిండి చినవెంకటరావు రూ.25 వేల విరాళం ప్రకటించారు. నగదును ఆదివారం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, ఇప్పిలి తిరుమల, గుడ్ల శ్రీను, కడగల సూరికి అందజేశారు. దాతకు ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేపాడ: కార్తీకమాసం సందర్భంగా వల్లంపూడి గ్రామంలోని షిర్డీసాయి, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల ప్రాంగణంలో గ్రామానికి చెందిన షిర్డీసాయి మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు అనిల్‌శర్మ బృందం ముందుగా పలువురు దంపతులతో ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం శివపార్వతుల కల్యాణం జరిపించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఘనంగా కంచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గంట్యాడ: సిరిపురంలో గ్రామదేవత కంచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామసర్పంచ్ గుండ్రపు సత్యారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతి

విజయనగరం రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇందులో భాగంగా మండలంలో ఉన్న ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి రూ.2 లక్షల విలువైన వర్కులను మంజూరు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరావు తెలిపారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రహదారుల్లోని గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. వీటితో పాటు అదనంగా రెండేసి లక్షల రూపాయలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా గ్రామాల్లో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలన్నారు.




బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతి

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి గ్రామంలో చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 65లో ఉన్న ప్రభుత్వ భూమిని పలువురు భూస్వాములు, అధికార పార్టీకి చెందిన వారు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆక్రమిత భూమిలో వ్యవసాయ బోర్లు తవ్వి అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు పొందారని ఆరోపించారు. అలాగే గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత సర్వే నంబర్ 80లో సింహాద్రి చెరువును ఆక్రమించి వాల్టా చట్టానికి తూట్లు పొడిచారన్నారు. ప్రధాన జలవనరుగా ఉన్న గెడ్డ కాలువతో పాటు శ్మశాన భూమిని ఆక్రమించినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అపురూపం..
పారసాం శివయ్య దర్శనం



పారసాం శివాలయం..

- ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఆలయం
- ద్వాదశ జ్యోతిర్లింగాలు ప్రత్యేకం
- కార్తీకమాసంలో భక్తుల తాకిడి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం శివాలయం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయానికి వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. కాగా 2017లో విజయనగరం పట్టణానికి చెందిన ఓ వ్యాపారవేత్త స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.2 కోట్లు వెచ్చించి ఆలయాన్ని పునర్నిర్మించారు. కాశీ నుంచి విగ్రహాలను తెప్పించి సువిశాలంగా ఆలయాన్ని నిర్మించారు. శివాలయంలో పదుల సంఖ్యలో ఉపాలయాలను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. పొరుగు రాష్ట్రాల నుంచి కళాకారులను తెప్పించి నాటి ప్రాచీన శిలలను ఆలయంపై చెక్కించారు. ఈ శివాలయంలో లక్ష్మీ గణపతి, భ్రమరాంభిక సహిత లోకనాథ మల్లికార్జున స్వామి, అయ్యప్పస్వామి, వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కాలభైరవ స్వామి వారి ఉపాలయాలున్నాయి. కాశీ నుంచి తెచ్చి ప్రతిష్ఠించిన ద్వాదశ జ్యోతిర్లింగాలు ఇక్కడి ప్రత్యేకం. అలాగే మానసాదేవి, కాల భైరవుడి ఉపాలయాలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. సాధారణ రోజుల కంటే కార్తీకమాసంలో శివాలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రతి మాసశివరాత్రితో పాటు ఆరుద్ర నక్షత్రం రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. కార్తీకమాస మూడో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధానార్చకుడు చంద్రమౌళిశర్మ తెలిపారు.

ఇలా చేరుకోవాలి...

పారసాం నెల్లిమర్ల మండల కేంద్రానికి శివారు గ్రామం. విజయనగరం నుంచి రావాల్సిన భక్తులు కాంప్లెక్స్ నుంచి గంటస్తంభం ప్రాంతానికి చేరుకోవాలి. అక్కడి నుంచి పారసాం గ్రామానికి ఆటోలు ఉంటాయి. శివారు గ్రామం కావడంతో సొంత వాహనాల్లో రావడం శ్రేయస్కరం. వైఎస్సార్ నగర్, కొండకరకాం, కొండవెలగాడ రహదారి మీదుగా పారసాంకు చేరుకోవాల్సి ఉంది.



ఉపాలయాలు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం: శాసనమండలి సభ్యుని ఉప ఎన్నిక రద్దయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించడంతో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక యథాతథంగా కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతిరూపంలో అధికారులకు తెలియజేయాలని కోరారు.

18 మంది జూదరుల అరెస్టు

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: మండల కేంద్రంతో పాటు ఒమ్మి గ్రామంలో పోలీసులు ఆదివారం దాడిచేసి, పేకాడ ఆడుతున్న 18మందిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్సై బి.గణేష్ అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని కొండపేటలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.5010 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒమ్మి గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి 8 మందిని అరెస్టుచేశారు. వారి నుంచి రూ.4070 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా పేకాట ఆడినా, కోడిపందాలు నిర్వహించినా సెల్‌నంబర్ 9121109444కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

అయ్యకోనేరును పరిరక్షించుకోవాలి..

విజయనగరం:

చారిత్రక ప్రాశస్త్యం కలిగిన అయ్యకోనేరును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, కోనేరును అందంగా తీర్చిదిద్ది, ప్రజావసరాల కోసమే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే ఈ కోనేరులో కొంతమంది పూజా సామాగ్రిని, ఇతర నిరుపయోగ వస్తువులను పడేస్తున్నారని, దీంతో కోనేరు పాడవుతోందన్నారు. కోనేరులో, పరిసర ప్రాంతాల్లో చెత్త వేసే వారిపై నిఘా పెట్టామన్నారు. ఎవరైనా చెత్త వేస్తూ పట్టుబడితే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందిచే చెత్త తీయించారు.



చెత్త తీస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు కుమిలి విద్యార్థులు

పూసపాటిరేగ మండలంలోని కుమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్ఎం శ్రీదేవి, పీఈటీ కమలానాథరావు, ఉపాధ్యాయులు రాంబాబు, తదితరులు అభినందించారు. – పూసపాటిరేగ



పరామర్శలు..

నెల్లిమర్ల మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్న బూరాడపేట సర్పంచ్ ప్రతినిధి బెల్లాన రామారావు, పీఏసీఎస్ చైర్మెన్ కోట్ల పైడినాయుడు.. కొండగుంపాంలో ఉపాధ్యాయుడు పతివాడ త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నేత పతివాడ అప్పారావు.. పారసాంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సంగంరెడ్డి సాంబ, తదితరులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్



చిన బూరాడపేటలో సర్పంచ్ బెల్లాన రామారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పుస్తక ప్రదర్శన..



జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ కూడలి వద్ద పుస్తక ప్రదర్శన, సగం ధరకే పుస్తకాల అమ్మకం కార్యక్రమం చేపట్టారు. పుస్తక పఠనం అభిరుచిని ప్రజల్లో పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్ తెలిపారు. ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయాన్ని పుస్తకాలు చదివేందుకు కేటాయించాలని సూచించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొత్తలి ఎర్నాయుడు, గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, ఉపాధ్యక్షుడు కె.దయానంద్, గ్రంథాలయ ఉద్యోగుల సంఘ మాజీ అధ్యక్షుడు బి.రామభద్రరాజు, సాయిరెడ్డి, సీఎస్ చలం, సీతం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవికుమార్, సంజయ్, వాకర్స్ క్లబ్ సభ్యులు శ్రీరామమూర్తి, సత్యం, చిరంజీవిరావు, జనార్దన్, షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

నేత్ర వైద్యశిబిరం

మెరకముడిదాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) విశాఖపట్నానికి చెందిన నవ జీవన్, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వ హించారు. శిబిరంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ రుత్తల సురేష్ 116 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 61మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వీరికి త్వరలో ఉచితంగా తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి సీహెచ్.వెంకటరమణ తెలిపారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రామారావు, స్పందన సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ సురేష్